క్లుప్తంగా

అర్బన్ మార్కెట్ ప్రారంభం



జగ్గయ్యపేట అర్బన్: డ్వాక్రా సభ్యులు ఆర్థికంగా స్వయంసమృద్ధి సాధించేందుకు ప్రభుత్వం సున్నావడ్డీకే రుణాలను అందజేస్తోందని మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర అన్నారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ కూడలిలో మెప్మా ఆధ్వర్యంలో డ్వాక్రా మహిళలు ఏర్పాటు చేసిన అర్బన్ మార్కెట్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డ్వాక్రా మహిళలు ఒకబృందంగా ఏర్పడి ప్రత్యేక వ్యాపార సముదాయాన్ని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ అర్బన్ మార్కెట్ ద్వారా నాణ్యమైన ఉత్పత్తులను వినియోగదారులకు తక్కువ ధరకే అందేలా చూడాలని డ్వాక్రా సభ్యులకు సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు రామలక్ష్మి, గీతారాణి, సైదేశ్వరరావు, వెంకట్, టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి మైనేని రాధా, నాయకులు, మెప్మా సీవీలు నిర్మల, దుర్గ, వెంకట్, ఆర్పీలు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

హక్కుల వేలం ద్వారా రూ.2.22లక్షలు ఆదాయం



పెనుగంచిప్రోలు:గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మవారి ఆలయానికి సంబంధించి శుక్రవారం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన ఆయా హక్కుల బహిరంగ వేలం ద్వారా ఆలయానికి రూ.2,22,500 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో కిషోర్‌కుమార్ తెలిపారు. ఆలయ ప్రాంగణంలో నాలుగునెలలపాటు సులభ్ కాంప్లెక్స్ నిర్వహణ హక్కులను రూ.లక్షకు నూతలపాటి సురేష్, ఆలయంలో నిరుపయోగంగా ఉన్న స్క్రాప్ తీసుకెళ్లే హక్కులను రూ.1,22,500లకు గుత్తికొండ పోతయ్య కైవసం చేసుకున్నారు. కార్యక్రమంలో ఏఈవో ఉమాపతి, తిరుమలేశ్వరరావు, ఏఈ రాజు, పాలకవర్గ సభ్యులు బెజవాడ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

నందిగామ టౌన్: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని కేవీఆర్ కళాశాల ప్రిన్సిపల్ రాయప్ప పేర్కొన్నారు. పర్యావరణ పర్యాటక దినోత్సవం సందర్భంగా కళాశాల ఆవరణలో శుక్రవారం ఆయన విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యాటకరంగ అభివృద్ధిలో పచ్చదనం, పరిశుభ్రత ఎంతో అవసరమన్నారు. ముఖ్యంగా ప్రతిఒక్కరూ మొక్కలు నాటడంతోపాటు వాటిని పరిరక్షించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పీడీ వాసిరెడ్డి నాగేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్తలు ఏలూరి పిచ్చేశ్వరరావు, మధుసూదనరావు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

ముగ్గురు వ్యక్తులు అరెస్ట్

కంచికచర్ల : మండలంలోని మోగులూరు మున్నేరు నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా జేసీబీతో అక్రమంగా ఇసుకను తవ్వి లారీతో తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను శుక్రవారం అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ బోనగిరి రాజు తెలిపారు. ఇసుక లారీతోపాటు జేసీబీని కూడా స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. ఎస్ఐ మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తే కేసు నమోదు చేసి అరెస్ట్ చేస్తామన్నారు. అవసరమైతే వాహనాలను సీజ్ చేస్తామని ఎస్ఐ హెచ్చరించారు.

ఎన్జీవో కార్యవర్గం ఎన్నిక



నందిగామ టౌన్: నూతన పాలకవర్గం ఎన్జీవో సంఘ అభివృద్ధికి కృషి చేయాలని సంఘ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్ సూచించారు. ఏపీ ఎన్జీవో సంఘం నందిగామ తాలూకా కోఆప్షన్ ఎన్నికలను స్థానిక ఎన్జీవో సంఘ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘ అధ్యక్షునిగా షేక్ బషు, కార్యదర్శిగా సాయిరామ్, కోశాధికారిగా ఎండీ అబ్దుల్లా షరీఫ్ లతో పాటు కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు తెలిపారు. నూతన కార్యవర్గం సంఘ అభివృద్ధికి, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కృషి చేయాలని సూచించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఆయనతోపాటు సభ్యులు అభినందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సత్యనారాయణరెడ్డి, నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నేషనల్ సిల్క్ ఎక్స్‌పో

లబ్బీపేట(విజయవాడతూర్పు): బృందావన కాలనీలోని ఎ కన్వెన్షన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన నేషనల్ సిల్క్ ఎక్స్‌పో మహిళలకు విశేషంగా ఆకట్టుకుంటోంది. నాలుగురోజులపాటు నిర్వహించనున్న ఈ వస్త్ర ప్రదర్శన శుక్రవారం ప్రారంభం కాగా, దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన అన్నిరకాల మగ్గం ఉత్పత్తులు ప్రదర్శనలో ఉంచారు.

కలసిరాని ఖరీఫ్ సాగు

- సాగుచేసిన పంటలు వర్షార్పణం
- వరదలకు వేలాది ఎకరాల్లో పంటనష్టం
- మిగిలిన పంటను కాపాడుకునేందుకు అవస్థల్లో రైతులు
- పెట్టుబడిసాయం కోసం ఎదురుచూపులు
- ఏడాదికి రూ.20వేలు ఇస్తామన్న కూటమి ప్రభుత్వం
- మరోవారంలో ముగియనున్న ఖరీఫ్ సీజన్



అనిగండ్లపాడులో నీటమునిగిన వరిపంటను కాపాడుకునేందుకు యూరియా చల్లుతున్న రైతులు

పెనుగంచిప్రోలు/కంచికచర్ల: ఈ ఖరీఫ్ సీజన్ జగ్గయ్యపేట, నందిగామ రైతులకు ఏమాత్రం కలసిరాలేదు. సీజన్ ప్రారంభంలో అనావృష్టి అనంతరం అతివృష్టి ఖరీఫ్‌సాగు రైతులను నిలువునా ముంచాయి. జగ్గయ్యపేట నియోజకవర్గ రైతులు ఎన్నో ఆశలతో వరి, పత్తి, మొక్కజొన్న, మిర్చి, కందులు, మినుము, పెసరతోపాటు కూరగాయల సాగు చేపట్టారు. వరి, పత్తి , మొక్కజొన్న, మినుము, పెసర పంటలు కొంతముందుగా వేయగా, మిరప మాత్రం సాగర్ కాలువలకు నీరువచ్చాక సాగు చేపట్టారు. అయితే అంతా బాగుందన్న తరుణంలో వరదలకు పంటలన్నీ దెబ్బతిన్నాయి. పంటలన్నీ మునిగిపోవటంతోపాటు అన్నదాతలకు తీరని వేదన మిగిలింది.



గుమ్మడిదుర్రులో జేసీబీతో పూడికతీత చేపట్టిన రైతులు

జగ్గయ్యపేట నియోజకవర్గంలో...

ఖరీఫ్ సీజన్‌లో జగ్గయ్యపేట నియోజకవర్గంలోని జగ్గయ్యపేట, పెనుగంచిప్రోలు, వత్సవాయి మండలాల్లో కలిపి సాగువిస్తీర్ణం మొత్తం 28,750 హెక్టార్లు కాగా, ఈఏడాది ఇప్పటివరకు రైతులు 17,988 హెక్టార్లు సాగుచేపట్టారు. దీనిలో వరి 5,700హెక్టార్లు, పత్తి 6,600 హెక్టార్లు, మిర్చి 5వేల హెక్టార్లు, కందులు 140 హెక్టార్లు, మొక్కజొన్న 160హెక్టార్లు, పెసలు, మినుము కలిసి 150 హెక్టార్ల విస్తీర్ణంలో సాగు చేశారు. మరో 388 హెక్టార్లలో ఇతరపంటల సాగు చేపట్టారు.

భారీగా దెబ్బతిన్న పంటలు..

వరదలకు జగ్గయ్యపేట నియోజకవర్గంలో ఖరీఫ్‌లో సాగు చేసిన పంటల్లో 2346 హెక్టార్లలో నష్టం జరిగింది. ఇందులో వరిపంట అత్యధికంగా 1777 హెక్టార్లలో దెబ్బతినగా, పత్తి 453 హెక్టార్లు, మొక్కజొన్న 30హెక్టార్లు, కందులు 19 హెక్టార్లు, పెసర 60హెక్టార్లు, మినుము 5హెక్టార్లు, మిర్చి 270 హెక్టార్లలో దెబ్బతింది. అదేవిధంగా నందిగామ నియోజకవర్గంలోని కంచికచర్ల, నందిగామ, వీరులపాడు, చందర్లపాడు మండలాల్లోని రైతులు ఈ ఖరీఫ్ సీజన్‌లో పత్తి, మిర్చి, మొక్కజొన్న, అరటి, చెరకు, సోయాబీన్, కంద, కూరగాయలు, వరి, పెసర, మినుము తదితర పంటలు సాగుచేశారు. నియోజకవర్గంలో మొత్తం 26,395.28 హెక్టార్లలో పంటలు సాగుచేయగా, ఇటీవల సంభవించిన భారీ వరదలకు 10,736 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయి. అంటే సాగుచేసిన పంటల్లో 40శాతం పంటలు వరదలకు దెబ్బతిన్నాయి. ఆరుగాలం కష్టపడి సాగుచేసిన పంటలు వరదలకు నీటమునగడంతో రైతులకు భారీనష్టం వాటిల్లింది. తిరిగి పంటలు సాగుచేద్దామన్నా మళ్లీ అప్పులు చేయాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు.

రైతులకు తప్పని పాట్లు....

వర్షాలు, వరదలకు దెబ్బతిన్న పొలాల్లోని మిగిలిన పంటను కాపాడుకునేందుకు రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. ఇప్పటికే ఎకరానికి రూ.20వేల నుంచి రూ.30వేలు పెట్టుబడి పెట్టిన రైతులు యూరియా చల్లుకోవడంతోపాటు పంటకు బలంమందులు కొడుతున్నారు. మిర్చి మొక్కలు తిరిగి నాటుతున్నారు. దీంతో అదనంగా పెట్టుబడి ఖర్చులు పెరుగుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.



వరదలకు పెనుగంచిప్రోలు మండలం గుమ్మడిదుర్రులో దెబ్బతిన్న వరిపంట

సాగుసాయం అందక....

గతేడాది వరకు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఖరీఫ్ సీజన్ ఆరంభంలోనే రైతన్నలకు రైతుభరోసా పథకం కింద నిధులను విడుదల చేసింది. ఏడాదికి రూ.13,500 చొప్పున రైతుల బ్యాంకు ఖాతాలో జమచేసింది. దీంతో రైతులు పెట్టుబడికి అప్పులు చేయాల్సిన పనిలేకుండా పోయింది. అయితే ఈఏడాది ఖరీఫ్ సీజన్ ముగుస్తున్నా రైతులకు నేటికీ పెట్టుబడి సాయం అందకపోగా, మరోవైపు అప్పోసప్పో చేసి సాగు చేసిన పంటలు సైతం వర్షార్పణం కావడం రైతులను మరింత కుంగదీసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అన్నదాత సుఖీభవ పథకం కింద పెట్టుబడి సాయం ఏటా రూ.20వేలు ఇస్తామని చెప్పినప్పటికీ ఖరీఫ్ పూర్తవుతున్నా ఆఊసే లేకపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే అన్నదాత సుఖీభవ కింద రూ.20వేలను పెట్టుబడిసాయంగా అందించాలని రైతులు కోరుతున్నారు.



కంచికచర్ల మండలం గండేపల్లిలో వరదలకు దెబ్బతిన్న పంటను తొలగించి నాటిన మిరపనారు

ఖరీఫ్ నిండా ముంచింది..



భారీవర్షాలు, వరదలు ఈఏడాది రైతులను నిండా ముంచాయి. వరదలకు నెల రోజులు నిండిన పంట అంతా కొట్టుకుపోయింది. మిగిలిన పంటను కాపాడుకునేందుకు తువ్వకాలువకు నీళ్ల రావాలి. గండ్లుపడటంతో ఇప్పుడు వచ్చే పరిస్థితి లేకుండా పోయింది.

– కొత్తపల్లి పెంటయ్య, రైతు, అనిగండ్లపాడు, పెనుగంచిప్రోలు మండలం

అదనపు పెట్టుబడి..



వరదలకు మిర్చి మొక్కలు మొత్తం కొట్టుకుపోయాయి. అప్పటికే రైతులు రూ.30వేలు నుంచి రూ.40వేలు పెట్టుబడి పెట్టారు. మొక్కలు కొట్టుకుపోవటంతో తిరిగి అదనపు పెట్టుబడి పెట్టి మొక్కలు నాటాల్సి వస్తోంది. అలాగే మందులు ఎక్కువగా కొట్టాల్సి వస్తోంది.

– లగడపాటి సురేష్, రైతు, శివాపురం, పెనుగంచిప్రోలు మండలం

మున్సిపల్ ఉద్యోగులు బదిలీ

జగ్గయ్యపేట: సాధారణ బదిలీల్లో భాగంగా జగ్గయ్యపేట మున్సిపాలిటీ ఇంజినీరింగ్ విభాగంలో పనిచేస్తున్న పలువురు ఉద్యోగులు బదిలీ అయ్యారు. ఇక్కడ డీఈగా పనిచేస్తున్న శివకోటేశ్వరరావు విజయవాడ నగరపాలక సంస్థ బదిలీ కాగా, ఏఈ హనుమంతరావు తిరువూరు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ దుర్గాప్రసాద్ నెల్లూరు జిల్లా ఆత్మకూరుకు బదిలీ అయ్యారు. విజయవాడలో పనిచేస్తున్న డీఈ కలీముల్లా, ఏఈలుగా ఇసారాఅహ్మద్, మోసామి, గుడివాడలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న అంబటి రాంబాబు బదిలీపై జగ్గయ్యపేట రానున్నారు.

వీఆర్వోలతో సమావేశం

జుజ్జూరు(వీరులపాడు): వీఆర్వోలు గ్రామాల్లో ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలని తహసీల్దార్ రాజకిషోర్ సూచించారు.జుజ్జూరులోని తన కార్యాలయంలో శుక్రవారం ఆయన మండలంలోని వీఆర్వోలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వీఆర్వోలు గ్రామాల్లో అందుబాటులో ఉండటంతోపాటు రైతులకు చెందిన వ్యవసాయ పొలాలకు సంబంధించిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. సమావేశంలో డీటీ ఆంజనేయులు, ఆర్ఐ బాబు, వీఆర్వోలు పాల్గొన్నారు.

మహిళలకు శిక్షణ



గరికపాడు(జగ్గయ్యపేట):మహిళలు కుట్టు శిక్షణను సద్వినియోగం చేసుకుని ఆర్థికస్వావలంబన సాధించాలని గరికపాడు కృషివిజ్ఞాన కేంద్రం(కేవీకే) గృహవిజ్ఞాన శాస్త్రవేత్త ప్రభావతి సూచించారు. గ్రామంలోని కేవీకేలో వారంరోజులపాటు నిర్వహించనున్న 'దుస్తులపై సహజ రంగుల అద్దకం' శిక్షణా తరగతులను శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ నేడు మార్కెట్‌లో దుస్తులకు గిరాకీ బాగా ఉందన్నారు. దుస్తులపై సహజ సిద్ధ రంగులు అద్దకంపై నిర్వహించే శిక్షణను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మున్సిపల్ స్థలంలో కాంప్లెక్స్ నిర్మాణానికి చర్యలు

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని పాత మున్సిపల్ కార్యాలయం స్థలంలో నూతన మున్సిపల్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టనున్నట్లు చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర తెలిపారు. ఎస్‌వీఎం ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ కంపెనీ ప్రతినిధులతో కలిసి శుక్రవారం ఆయన పాత మున్సిపల్ కార్యాలయం స్థలాన్ని పరిశీలించారు. మ్యాప్‌ను పరిశీలించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలోని తన చాంబర్‌లో చైర్మన్ రాఘవేంద్ర మాట్లాడుతూ ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా కొన్ని కోట్ల విలువైన పాత మున్సిపల్ కార్యాలయం స్థలం కొంతకాలంగా నిరుపయోగంగా ఉందన్నారు. ఈస్థలాన్ని బిల్డ్, ఆపరేట్ అండ్ ట్రాన్స్‌ఫర్ విధానంలో ఆధునికహంగులతో ఓ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టాలని ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య నిర్ణయించారని తెలిపారు. అందుకోసమే స్థలపరిశీలన చేసినట్లు వివరించారు. త్వరలో టెండర్లు పిలిచి కాంప్లెక్స్ నిర్మాణానికి చర్యలు చేపడతామని వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ శ్రీరాం సుబ్బారావు, టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి మైనేని రాధా, కౌన్సిలర్లు కన్నెబోయిన రామలక్ష్మి, కంచేటి గీతారాణి, గింజుపల్లి వెంకట్రావు, పేరం సైదేశ్వరరావు, వెంకట్ పాల్గొన్నారు.



మున్సిపల్ ఆఫీసులో మ్యాప్‌ను పరిశీలిస్తున్న రాఘవేంద్ర, ఎస్‌వీఎం ప్రతినిధులు

సబ్‌రిజిస్ట్రార్ దుర్గారాణి బాధ్యతల స్వీకారం

నందిగామ టౌన్: నందిగామ సబ్‌రిజిస్ట్రార్‌గా కాజ దుర్గారాణి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేసిన విద్యాధరణి బదిలీకాగా, ఆస్థానంలో కైకలూరు సబ్‌రిజిస్ట్రార్‌గా పని చేస్తున్న దుర్గారాణి బదిలీపై ఇక్కడకు వచ్చారు. క్రయవిక్రయదారులకు ఎల్లవేళలా అందుబాటులోఉండటంతోపాటు సిబ్బంది ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా నడుచుకునేలా చూస్తానన్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆమెకు కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికి అభినందనలు తెలియజేశారు.

పత్తిసాగులో సస్యరక్షణపై రైతులకు అవగాహన

భీమవరం(వత్సవాయి):పత్తిలో రసం పీల్చే పురుగుల విషయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏడీఏ సి.భవాని సూచించారు. మండలంలోని భీమవరంలో శుక్రవారం విజయవాడ కేంద్రీయ సమగ్ర సస్యరక్షణ కేంద్రం, ,గరికపాడు కృషివిజ్ఞాన కేంద్రం, వ్యవసాయశాఖ సంయుక్త ఆధ్వర్యంలో పత్తి , మిరప పంటలపై సస్యరక్షణ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.సస్యరక్షణ కేంద్రం అధికారి కె.వీరయ్యచౌదరి, కేవీకే కోఆర్డినేటర్ కృష్ణంరాజు, ఏవో రవికుమార్ తదితరులు గ్రామంలో సాగవుతున్న పత్తి, మిర్చి, వరి పంటలను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ పత్తిలో రసం పీల్చే పురుగు అదుపునకు వేపనూనె పిచికారి చేసుకోవడం, గులాబీ రంగు పురుగు నివారణకు లింగాకర్షణ బుట్టలు, తెల్లదోమ, తామర పురుగు నివారణకు పొలంలో జిగురు అట్టలు పెట్టుకోవాలని రైతులకు వివరించారు. మిరప పంటలో ప్రస్తుతం మొక్క మెత్తదనం కోసం పురుగుమందులను పిచికారి చేసుకోవాలన్నారు. ప్రతిరైతు ఏటా పంట మార్పిడి చేసినట్లయితే పెట్టుబడులు తగ్గి దిగుబడులు పెరిగే అవకాశం ఉందని వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ మాధురికుమారి, ప్రేమరంజిత్, రాజశేఖర్, శివప్రసాద్, రైతులు పాల్గొన్నారు.



భీమవరంలో పత్తిపంటను పరిశీలిస్తున్న ఏడీఏ భవాని, కృష్ణంరాజు, వీరయ్యచౌదరి, రవికుమార్

ముంపు ఇళ్లకు అందని పరిహారం

- భారీవర్షాలకు మూడురోజులపాటు ఇళ్లను వీడని వరద నీరు
- పాడైపోయిన సామగ్రి, దుస్తులు
- పరిహారం ఇవ్వని ప్రభుత్వం
- పట్టించుకోని ఎమ్మెల్యే సౌమ్య
- ఆందోళనలో వరద బాధితులు



కంచికచర్ల మండలం చెవిటికల్లులో నీటమునిగిన ఇల్లు(ఫైల్)

కంచికచర్ల: వరద ముంపునకు గురైన ప్రతి బాధితుడిని ఆదుకుంటామంటూ సీఎం చంద్రబాబు ప్రకటనలు గుప్పిస్తుండగా, ఆచరణలో మాత్రం ముంపునకు గురైన బాధితులకు పరిహారం అందడం లేదు. దీంతో వరద బాధితులు తీవ్ర ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. వరద ముంపు కారణంగా ఇళ్లలోకి నీరుచేరి విలువైన సామగ్రి, ఎలక్ట్రానిక్ వస్తువులు, వంట సామగ్రి, దుస్తులు వంటి పాడైపోవడంతో తీవ్రనష్టం జరగగా, వరదనష్టం నమోదు చేయకపోవడంతో పరిహారం అందడంలేదని బాధితులు వాపోతున్నారు.

గ్రామాల్లోకి భారీగా వరద నీరు...

వర్షాలకు కృష్ణానది పరివాహక గ్రామాల్లో వరద నీరు చేరడంతో అధికారులు బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించారు. కంచికచర్ల మండలంలోని 10గ్రామాలు కృష్ణానది, మున్నేరు నదీతీర ప్రాంతాల్లో ఉన్నాయి. కీసర మున్నేరుకు 1.90లక్షల వరదనీరు వచ్చింది. ఏటిపట్టు గ్రామాలైన కొత్తపేట, గనిఆత్కూరు, చెవిటికల్లు, మున్నలూరు, కునికెనపాడు, మోగులూరు, ఎస్.అమరవరం, వేములపల్లి, పెండ్యాల, గండేపల్లి గ్రామాల్లో వరద నీరు భారీగా చేరింది. చెవిటికల్లు గ్రామంలోని ఇళ్లలోకి వరదనీరు చేరడంతో నందిగామ ఏసీపీ డాక్టర్ బి రవికిరణ్, తహసీల్దార్ వి.జాహ్నవిలు తమ సిబ్బందితో నాటుపడవల సాయంతో బాధితులను చెవిటికల్లు గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేసిన పునరావాసకేంద్రానికి తరలించారు. కొత్తపేట గ్రామానికి చెందిన బాధితులను కంచికచర్ల ఓసీ కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి తరలించారు.

8817 ఇళ్లు ముంపునకు గురి..

ఏటిపట్టు గ్రామాల్లో 8817 ఇళ్లు వరద ముంపునకు గురయ్యాయని తొలుత నివేదికలో పేర్కొన్న అధికారులు, నీటమునిగిన ఇళ్ల బాధితులకు నిత్యావసర సరుకులు కూడా పంపిణీ చేశారు. నీట మునిగిన ప్రతి బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందిస్తామని ప్రకటించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, కంచికచర్ల మండలంలో నీటమునిగిన ఇళ్లకు ఒక్క రూపాయి కూడా పరిహారాన్ని అందించకపోవడంపై బాధితులు మండిపడుతున్నారు. అధికారులు, అధికారపార్టీ నాయకులు ఉదాసీన వైఖరి కారణంగానే తమకు ఎటువంటి పరిహారం అందడంలేదని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. నందిగామ నియోజకవర్గానికి ఆనుకుని ఉన్న మైలవరం నియోజకవర్గంలో నీట మునిగిన ఇళ్లకు పరిహారం కింద రూ.25వేలు అందిస్తున్న ప్రభుత్వానికి తమకు జరిగిన నష్టం కనిపించడం లేదా? అని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి ఏటిపట్టు గ్రామాల్లో వరదల్లో నీటమునిగిన ఇళ్లకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.



కంచికచర్ల పునరావాస కేంద్రంలో భోజనం చేస్తున్న వరద బాధితులు(ఫైల్)

48గంటలు వరదనీరు ఉంటేనే...

ప్రభుత్వ జీవో ప్రకారం 48 గంటలపాటు ఇళ్లలో వరదనీరు ఉంటేనే ఆ ఇళ్లను వరదలకు దెబ్బతిన్న ఇళ్లుగా గుర్తిస్తాం. బాధితులకు పరిహారం కూడా చెల్లిస్తాం. కంచికచర్ల మండలంలోని కృష్ణానది, మున్నేరు నదీ పరీవాహక గ్రామాల్లో నాలుగు నుంచి 24గంటల్లోనే వరదనీరు నిల్వ ఉంది. ప్రభుత్వ నిబంధనల మేరకు వాటిని ముంపు గ్రామాలుగా గుర్తించలేదు.

– వి.జాహ్నవి తహసీల్దార్, కంచికచర్ల

చెవిటికల్లులో ఆందోళన..

కంచికచర్ల: వరద ముంపునకు గురైన తమకు ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వడంలేదంటూ చెవిటికల్లు గ్రామానికి చెందిన బాధితులు శుక్రవారం గ్రామంలోని సచివాలయం వద్ద ఆందోళన చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తమకు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రోజుల తరబడి వర్షాలు, వరదనీటితో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న తాము నష్టపరిహారానికి ఎందుకు అర్హులం కాదో? చెప్పాలని డిమాండ్ చేశారు. వరదల కారణంగా ఇళ్లలోని వస్తువులు దెబ్బతిన్నాయని, పదిరోజులపాటు ఉపాధి కోల్పోయామని ఆవేదన వ్యక్తంచేశారు. తమ గ్రామానికి పక్కనే ఉన్న మైలవరం నియోజకవర్గం ఇబ్రహీంపట్నం మండలం దాములూరులో ముంపునకు గురైన ఇళ్లకు పరిహారం ఇచ్చిన ప్రభుత్వం తమకు ఎందుకు ఇవ్వదని ప్రశ్నించారు. ఇకనైనా పాలకులు, అధికారులు స్పందించి తమకు నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని వారు కోరారు.



చెవిటికల్లు సచివాలయం వద్ద శుక్రవారం ఆందోళన చేస్తున్న వరద బాధితులు

గుర్రపుడెక్క తొలగింపు పనుల ప్రారంభం

జగ్గయ్యపేట అర్బన్: పర్యాటక రంగ అభివృద్ధికి రాష్ట్రప్రభుత్వం కృషి చేస్తోందని జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) తెలిపారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక బైపాస్ రోడ్‌లోని బుద్ధుని విగ్రహం వద్ద చెరువులో చేపట్టిన గుర్రపుడెక్క తొలగింపు, పూడికతీత పనులను స్థానిక నాయకులు, అధికారులతో కలిసి ఎమ్మెల్యే తాతయ్య ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పర్యాటక రంగ అభివృద్ధికి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి మైనేని రాధాకృష్ణ, కౌన్సిలర్లు కన్నెబోయిన రామలక్ష్మి, కంచేటి గీతారాణి, గొట్టె నాగరాజు, నకిరిగంటి వెంకట్, పేరం సైదేశ్వరరావు, ఇర్రి నరసింహారావు, సంగెపు బుజ్జిబాబు, గింజుపల్లి వెంకట్రావు, నాయకులు గుంజ ఏడుకొండలు, కర్ల జోజి, వేదులాపురి సైదేశ్వరరావు, గాలం శ్రీను, పుసల పుల్లారావు, షేక్ షరీఫ్, అక్బర్, ఓర్సు వీరన్న పాల్గొన్నారు.



గుర్రపు డెక్క తొలగింపు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్(తాతయ్య)

చిరుద్యోగులను విధుల్లోకి తీసుకోవాలి

నందిగామటౌన్: ప్రభుత్వం సకాలంలో బిల్లులు ఇవ్వకపోయినా 23ఏళ్లుగా పని చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులను తొలగించడం బాధాకరమని సీఐటీయూ నాయకుడు కటారపు గోపాల్ అన్నారు. ఇటీవల తొలగించిన భోజన పథకం ఏజెన్సీ నిర్వాహకులు, వాచ్‌మెన్‌లు, శానిటేషన్ సిబ్బందితో కలిసి శుక్రవారం స్థానిక డీవైఈవో కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ మెనూ ప్రకారం విద్యార్థులకు ఆహారం వండిపెడుతూ జీవనం సాగిస్తున్న చిరుద్యోగులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి తొలగించిన చిరుద్యోగులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు గోపీనాయక్, యూనియన్ నాయకులు వేల్పుల ఏసోబు, కళావతి, సత్యవతి, పుల్లయ్య, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.



డీవైఈవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు, బాధితులు